


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 643 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర మంగళవారం20 జనవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

## బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా

# నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

-నేడు పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్

-జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక

-గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నేడు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది.

నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఏపీకి స్విస్ పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రధానంగా చర్చ

టెక్నాలజీ, ఫార్మా రంగాల్లో భాగస్వామ్యానికి ఆహ్వానం

విద్యా సంస్థల మధ్య సహకారంపైనా కీలక చర్చలు

ఇండియా-EFTA ఒప్పందంతో ఏపీకి ప్రయోజనమని లోకేశ్ ధీమా




## దావోస్ వేదికగా

# పెట్టుబడుల వేట..

### పక్కా ప్రణాళికతో సీఎం చంద్రబాబు బృందం

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు బృందం స్విట్జర్లాండ్ కు తరలివెళ్లింది. ఈ క్రమంలో వారు స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్‌తో జ్యూరిచ్‌లో సమావేశమయ్యారు. దీనిపై లోకేశ్ ట్వీట్ చేశారు.

ఏపీ-స్విట్జర్లాండ్ మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు స్విస్ కంపెనీలను ప్రోత్సహించడంపై ఈ భేటీలో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు లోకేశ్ తెలిపారు

2



## జ్యూరిచ్‌లో సీఎంకు ఘనంగా స్వాగతం పలికిన ప్రవాస తెలుగువారు

-ఏపీకి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నాలుగు రోజుల పర్యటన

-సీఎంతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్





ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్విట్జర్లాండ్ చేరుకున్నారు. జనవరి 19, సోమవారం ఉదయం ఆయన జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకోగా, యూరప్‌లోని ప్రవాస తెలుగువారు, ఎన్నారై టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ కూడా ఉన్నారు.అనంతరం జ్యూరిచ్‌లో భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జ్యూరిచ్‌లో నాకు ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు వారికి, ఎన్నారై టీడీపీ శ్రేణులకు ధన్యవాదాలు. యూరోప్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా జ్యూరిచ్ వచ్చి నా పట్ల చూపిన అభిమానానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు. మన తెలుగు భాషకు, సంస్కృతికి ప్రతీకలైన మీ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉంది," అని అన్నారు.జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' ను ప్రపంచానికి పరిచయం చేసి, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు 36 సమావేశాల్లో పాల్గొననున్నారు. అంతకుముందు జ్యూరిచ్ విమానాశ్రయంలో సింగపూర్ దేశాధ్యక్షుడు షణ్ముగరత్నం, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, వరల్డ్ బ్యాంక్ గ్రూప్ ప్రెసిడెంట్ అజయ్ బంగాతో చంద్రబాబు భేటీ అయ్యారు. అనంతరం చంద్రబాబు తన ప్రతినిధి బృందంతో కలిసి రోడ్డు మార్గంలో దావోస్‌కు బయల్దేరి వెళ్లారు.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...

-మరణించిన ఆరుగురు మావోయిస్టుల గుర్తింపు




3

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఉత్తర-పశ్చిమ ప్రాంతంలో భద్రతా బలగాలు మరో కీలక విజయాన్ని సాధించాయి. భోపాలపట్నం-ఫర్సేగఢ్ సరిహద్దుల్లోని అటవీ, కొండ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ ఇంచార్జ్ డీవీసీఎం దిలీప్ బెండ్జా సహా మొత్తం ఆరు మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఫలితం చూపని పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ అర్జీలు

యు.కొత్తపల్లి, సింహగర్జన ప్రతినిధి, జనవరి 19 : కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పి.జి.ఆర్.ఎస్ ఆశించిన ఫలితాలు బాధితులకు అందివ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రీవెన్స్ ఫిర్యాదులను ప్రభుత్వం బాధ్యతగా సంబంధిత శాఖకు పంపినా సదరు శాఖ బాధితులకు దారి చూపలేక పోతోందని బాధితులు విమర్శిస్తున్నారు. ఇటీవల ఒక వివాహిత తనను తన ఇద్దరి ఆడపిల్లలను కని తన భర్త వదిలేశాడని గ్రీవెన్స్ లో ప్రభుత్వాన్ని వేడుకుంటే... ఆ వేడుకోలు కాస్తా కాకినాడ శిశు సంక్షేమ శాఖకు చేరుకుంది. పిల్లలను పెంచడం కష్టంగా వుంది అని మొరపెట్టుకుంటే వరుసగా 3 రోజులు పాటు ఆఫీసు చుట్టూ తిప్పించిన సిబ్బంది, తప్పు చేసిన భర్త లాయర్ని వెంటబెట్టుకుని రావడంతో... మెత్తబడ్డ సిబ్బంది, అధికారి తామేమీ చేయలేమని చేతులు ఎత్తేశారు. ఈ మాత్రం దానికే గ్రీవెన్స్ దేనికంటూ బాధిత మహిళ కన్నీటితో వెనుతిరిగింది. గ్రీవెన్స్ ఫిర్యాదులపై ఇకనైనా కఠినంగా చర్యలు ఉంటే బాధిత మహిళలు బిడ్డలతో సహా ఆత్మ హత్యలు చేసుకునే దుస్థితి తప్పుతుందని ప్రభుత్వం భావించి జిల్లా అధికారులకు సూచన చేయాలని పలువురు వేడుకుంటున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ - PGRS




## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు

# సుప్రీంకోర్టు నోటీసులు

-తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసు జారీ

-స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

-పార్టీ ఫిరాయింపులపై తీర్పును అమలు చేయలేదని ఆరోపణ

3



# “ నాకు సమయం లేదు”

ఒకప్పుడు 12 గంటలు పట్టే ప్రయాణం
ఇప్పుడు 4 గంటలకే పూర్తవుతుంది, అయినా మనిషి అంటున్నాడు “సమయం లేదు”.

ఒకప్పుడు 12 మంది ఉన్న కుటుంబం
ఇప్పుడు 2 మందికే పరిమితమైంది, అయినా మనిషి అంటున్నాడు “సమయం లేదు”.

ఒక సందేశం చేరడానికి ఒకప్పుడు 2 వారాలు పట్టేది, ఇప్పుడు 2 సెకన్లలో చేరుతుంది,
అయినా మనిషి అంటున్నాడు “సమయం లేదు”.

దూరంగా ఉన్నవారి ముఖం చూడడానికి
ఒకప్పుడు సంవత్సరాలు పట్టేవి, ఇప్పుడు సెకన్లలో కనిపిస్తోంది,
అయినా మనిషి అంటున్నాడు “సమయం లేదు”.

ఇంట్లో తిరగడానికి ఒకప్పుడు ఎంతో శ్రమ పడేది,
ఇప్పుడు లిఫ్ట్‌లో క్షణాల్లో పూర్తవుతోంది, అయినా మనిషి అంటున్నాడు “సమయం లేదు”.

బ్యాంక్ క్యూలో గంటల తరబడి నిలబడ్డ మనిషి,
ఇప్పుడు మొబైల్‌లో సెకన్లలో లావాదేవీలు చేస్తాడు, అయినా అంటున్నాడు “సమయం లేదు”.

ఒకప్పుడు వైద్య పరీక్షల రిపోర్టులు రావడానికి వారాలు పట్టేవి, ఇప్పుడు కొన్ని గంటల్లోనే వస్తున్నాయి, అయినా మనిషి అంటున్నాడు “సమయం లేదు”.

– రోజువారీ విరుద్ధతలు

ఆక్టివాపై వెళ్తూ ఒక చేయి హ్యాండిల్‌పై, ఇంకో చేయి ఫోన్‌పై ఆగి మాట్లాడే సమయం లేదంటూ “సమయం లేదు”.

కారు నడుపుతూ ఒక చేయి స్టీరింగ్‌పై, ఇంకో చేయి వాట్సాప్‌పై
ఎందుకంటే అతనికి సమయం లేదు.

ట్రాఫిక్‌లో తానే కొత్త లేన్ సృష్టిస్తూ ముందుకు దూసుకుపోతాడు
ఎందుకంటే అతనికి సమయం లేదు.

స్నేహితుల మధ్య, జనాల్లో ఉన్నా వేళ్లు మాత్రం ఫోన్‌లోనే బిజీ
ఎక్కడికో చేరాల్సి ఉందట “సమయం లేదు”.

ఒంటరిగా ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉంటాడు,
కానీ మనుషుల మధ్య ఉంటే అసహనంగా మారతాడు
ఎందుకంటే అతనికి సమయం లేదు.

– అతనికి సమయం లేనివి

- యోగా చేయడానికి సమయం లేదు
- పుస్తకాలు చదవడానికి సమయం లేదు
- తల్లిదండ్రులకు ఫోన్ చేయడానికి సమయం లేదు
- స్నేహితులను కలవడానికి సమయం లేదు
- ప్రకృతిని ఆస్వాదించడానికి సమయం లేదు
- కుటుంబంతో ఉండడానికి సమయం లేదు
- భోజనం చేయడానికి సమయం లేదు
- నిద్రపోవడానికి సమయం లేదు

– కానీ వీటికి మాత్రం సమయం ఉంది

ఐపిఎల్
నెట్ ఫ్లిక్స్
అర్థంలేని రీల్స్
రాజకీయ వాదనలు

కానీ తనకోసం మాత్రం సమయం లేదు!

వాస్తవం
ప్రపంచం సులభమైంది, సాంకేతికత దగ్గరైంది, దూరాలు మాయమయ్యాయి, సౌకర్యాలు పెరిగాయి, అవకాశాలు విస్తరించాయిడ
అయినా మనిషి “సమయం లేదు” అని చెబుతూనే తన నుంచి తానే దూరమయ్యాడు.

మనము మర్చిపోతున్నది నిశ్శబ్దంగా కూర్చోవడం, తనతో తానే మాట్లాడుకోవడం, తనను తాను అర్థం చేసుకోవడం, కొన్ని స్వచ్ఛమైన క్షణాల్లో నవ్వడం,
కానీ ఇవన్నీ చేయలేదు ఎందుకంటే అతనికి సమయం లేదు.

– చివరి సత్యం

ఒక రోజు సమయమే అతని చేతుల నుంచి జారిపోతుంది. ఆ చివరి క్షణంలో అతనికి అర్థమవుతుంది.

“సమయం ఉందిడ కానీ నేను ఎప్పుడూ ‘సమయం లేదు’ అన్నానుడ అలా జీవించడాన్నే మర్చిపోయాను.”

– సందేశం

మీ కోసం కొంత సమయం కేటాయించండి



బంధాలకు కొంత సమయం ఇవ్వండి
మీ మనసుకు, శాంతికి, జీవిత సారానికి
కొంచెం జీవించండి

ఎందుకంటే “సమయం లేదు” అనేది నిజం కాదుడ

అది కేవలం ఒక అలవాటు మాత్రమే.
ఆ అలవాటు మారాల్సిందే..!

– సేకరణ...
మీ
బత్తుల ముత్యాల రావు
రిటైర్డ్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సూపరిడెంట్

# విశ్రాంత మండల విద్యాధికారి డి.అంజయ్య సేవలకు గుర్తింపు

సంగారెడ్డి
రాజస్థాన్ రాష్ట్రంలోని మౌంట్ ఆఫ్ లో బ్రహ్మకుమారి సంస్థ నిర్వహించే ఆధ్యాత్మిక రాజయోగ సమ్మేళనంలో సంగారెడ్డి జిల్లా విశ్రాంత మండల విద్యాధికారి చేసిన సేవలకు గుర్తింపుగా అభినందించడం జరిగింది. 47 సార్లు రక్తదానం, సుమారు 800 బాల కార్మికులను బడిబాటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, ఎన్. సి.సి. అధికారిగా విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించడం, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడం, వంటి పలు కార్యక్రమాలు విజయవంతం చేసినందుకు బ్రహ్మకుమారి సంస్థ సమాజసేవ విభాగము ప్రత్యేక కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాధికారి డి.అంజయ్యకు మేమెంటో అందించడం జరిగింది. అలాగే కేంద్ర ప్రభుత్వము మరియు బ్రహ్మకుమారి సంస్థ సంయుక్తంగా నిర్వహించే సంఘం ప్రాజెక్టు ద్వారా సీనియర్ సిటిజన్స్ కు గౌరవించి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సంస్థ కోరింది.

# నూతన తాసిల్దార్ ను సన్మానించిన సర్పంచ్ అమరేశ్వరి శివమణి

ఝరాసంగం)
ఝరాసంగం మండల తహసీల్దార్ గా సి. భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిర్లపల్లి గ్రామ నూతన సర్పంచ్ అమరేశ్వరి శివమణి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి నాయకులు సోమవారం తహసీల్దార్ ను కలిసి పూలమాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. రైతుల, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ ను కోరారు. పాలనకు పార్టీ తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్ హుస్సేన్, పాండు, నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ప్రథమ సమావేశం నిర్వహణ

న్యాల్కల్
గ్రామ పంచాయతీ ప్రథమ సమావేశం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఎం అర్ ప్రవీణ్ కుమార్, సెక్రటరీ ధనరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఆశా వర్కర్లు, హెడ్ మాస్టర్ (పాఠశాల), అంగన్‌వాడీ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, ఏఈఓ వార్డు సభ్యులు హాజరయ్యారు.ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి, ఆరోగ్య సేవలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, అంగన్‌వాడీ కార్యకలాపాలు, విద్యుత్ సరఫరా సమస్యలు, పాఠశాలలు మరియు గ్రామంలో మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చించబడింది. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు.సమావేశం సానుకూల వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# విద్యార్థులకు అల్పాహారాన్ని అందించిన సర్పంచ్

న్యాల్కల్)
శ్రీకాంత్ రెడ్డి న్యామతబాద్ సర్పంచ్ జడ్పీ ఎచ్ ఎస్ మిర్జాపూర్ ( బి) న్యాల్కల్ మండల్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో పదివేల రూపాయల నగదు అందించారు. సోమవారం విద్యార్థులందరికీ న్యామతాబాద్ సర్పంచ్



అల్పాహారాన్ని (చెనిగలు ,పల్లీలు ) వడ్డించి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు వారికి కృతజ్ఞతలుతెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రాజ్ కుమార్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

# వీరస్వామి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన టీడీపీ నాయకులు

## -ఎమ్మెల్యే ఎంజీఆర్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు




పాతపట్నం
పాతపట్నం మండలం సీతారాం పల్లి గ్రామానికి చెందిన వీరస్వామి ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందడంతో మృతుడు తల్లి ఒంటరిగా దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పడ్డ లోకేశ్వరరావు,మానవత్వంతో స్పందించారు. సోమవారం ఆమెకు పరామర్శించి, 5,000 వేల రూపాయలు సహాయం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును స్ఫూర్తిగా తీసుకుంటూ ఆమెకు సాయం అందించామన్నారు. ఎమ్మెల్యే అడుగుజాడల్లో నడుస్తూ జీవిత ప్రయాణం సాగిస్తున్నామని అన్నారు. ఎంజీఆర్ ఎమ్మెల్యే కాక ముందు నుండి ఒక సామాన్యుడిగా ఉంటూ ఎంతోమంది పేద ప్రజలకు ఒక్క పాతపట్నం నియోజకవర్గమే కాకుండా జిల్లా వ్యాప్తంగా కష్టం అని తన వద్దకు వచ్చిన వారందరికీ తనవంతు వైద్యం, విద్యా,పెళ్లికానుకలు, దేవాలయాలు అభివృద్ధి కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారని ఆయన కొనియాడారు.నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అతి చేరువుగా ఉంటూ, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఎన్నో విధాలుగా సహాయం చేస్తూ అండగా నిలబడిన ఆయనకు ఎమ్మెల్యేగా ప్రజలు పట్టం కట్టారని, ఆయన స్ఫూర్తితో మేమంతా కష్టాల్లో ఉన్న పేదవారు ఎవరైనా తమను సంప్రదిస్తే తప్పకుండా మాకు తోచిన సాయం చేస్తామన్నారు.అలానే ఆమెకు ఇంకా ఏదైనా అవసరం ఉంటే తమని సంప్రదించాలని భరోసా ఇచ్చారు.అలానే ఆపదలో ఉండి వైద్య ఖర్చులు పెట్టలేనటువంటి నిరుపేదలు ఎవరైనా ఉంటే మమ్మల్ని సంప్రదిస్తే మాకు తోచిన సహాయం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పడ్డ లోకేశ్వరరావుతో పాటుగా పడ్డ శేషగిరి, కె.రామారావు,ఆర్ కృష్ణమూర్తి,రమేష్ బిస్వాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులుగా గణేష్ బాబు

## ప్రధాన కార్యదర్శిగా సునీల్ దత్

## ఏకగ్రీవంగా జిల్లా కార్యవర్గం ఎన్నిక..

తిరుపతి, జనవరి 19 :
బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ తిరుపతి జిల్లా నూతన అధ్యక్షులుగా ఎం గణేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా కే సునీల్ దత్, ట్రెజరర్ గా పి విజయ్ కుమార్ లతో పాటు జిల్లా కార్యవర్గం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్లో బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలు కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్ట భాస్కర్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు కోటపాటి హరిబాబు, గవ్వల ప్రసాద్ పరివేక్షించారు. ఈ నూతన కార్యవర్గం బీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర నేతలు పేర్కొన్నారు.
జిల్లా బిసి ఉద్యోగుల ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు గా డాక్టర్ ప్రొఫెసర్ వీరబ్రహ్మయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులుగా కే వాసుదేవయ్య, కే గోవర్ధన్ యాదవ్, సీ. శ్రీహరి,వై. ముత్యాలయ్య, జే వాసు, ఆర్ శ్రీనివాస లు. జాయింట్ సెక్రటరీలుగా జే మోహన్, కే. మురళీధర్, ఆర్ రామ్మోహన్ ఆర్ సోమశేఖర్ ఏ రమేష్ బాబు ఎం శ్రీనివాసులు ఎం రవీంద్ర, డి. కరుణ కుమార్, కే. నాగరాజు, హరికృష్ణ, వై సెందిల్ కుమార్ లు. మహిళా సెక్రటరీలుగా ఈ లతా, కే నాగలక్ష్మి, బి జయలక్ష్మి, ఝాన్సీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మీడియాతో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం గణేష్ బాబు, కె సునీల్ దత్ లు మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా బీసీ ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులుగా తమని ఎన్నుకోవడం పట్ల అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలు బీసీ ఉద్యోగులు ఎక్కడైనా ఎవరికైనా ఎలాంటి సమస్యలు ఉన్న వారి సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేసే బీసీ ఉద్యోగులందరూ ఐక్యంగా ఏకతాటిపై ఉంటే ఎలాంటి సమస్యలనైనా తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో మండల కేంద్రాలలో పర్యటించి బిసి ఉద్యోగుల మండల నియోజకవర్గ కమిటీలను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు




పేర్కొన్నారు. మనమంతా ఒక కార్యవర్గంగా ఏర్పడటం మిగిలిన ప్రభుత్వ ఉద్యోగుల కార్యవర్గాలకు కూడా ఒక ఆదర్శంగా నిలవాలని, మన బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఐక్యతే మన లక్ష్యంగా ముందుకు సాగుదాం అని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ నూతన కార్యవర్గానికి పలువురు అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# పి.మల్లవరంలో ఘనంగా నిర్వహించిన వీరభద్రుని సంబరం





తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి, జనవరి 20 : కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం గ్రామంలో మల్లవరం నీటి సంఘం అధ్యక్షుడు ధూళిపూడి గోవిందు (గోపి) కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వీరభద్రుని సంబరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీరభద్రుని పూజానంతరం గ్రామవీధులలో వీరభద్రుల వేషధారులు నృత్యాలతో ఊరేగింపుగా వీధులలో తిరుగుతూ భారీగా బాణాసంచా కాల్చుతూ ఊరేగారు. తదనంతరం వారి గృహంలో వీరభద్రుని పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, వాటర్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ సునీల్ కుమార్, ముమ్మిడివరం ఏఎంసి చైర్మన్ ఓగురి భాగ్యశ్రీ, వేగ్నేశ భాస్కర రాజు, అల్లూరి రామకృష్ణరాజు, తాళ్లరేవు సొసైటీ చైర్మన్ విళ్ళ వీర ఆదినారాయణ (వీర), తెదేపా మండలం అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ, (బాబి) మద్దింశెట్టి పురుషోత్తం, అత్తిలి బాబురావు, గుద్దటి జమ్మి, ముత్యాల జయశ్రీ, బద్రి రమాదేవి, ఉంగరాల వెంకటేశ్వరరావు, (బూరిబాబు), ధూళిపూడి శుభ, విళ్ళ సత్యనారాయణ, వేగి నాగ భైరవ ప్రసాద్ (డాక్టర్), నరాల వెంకటరమణ, అందె కాశి, చిక్కం రామచంద్రుడు, సుందర పల్లి సత్యనారాయణ, ఎలిపే నాగేశ్వరరావు, కొత్తూరి ధనుంజయ, నరాల వెంకటరమణ, చింతపల్లి రమేష్, పోతాబత్తుల రాంబాబు, మరియు కూటమి సభ్యులు, బంధుమిత్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నీటిపారుదల సంస్థలో పనిచేయు కాంట్రాక్ట్ ఉద్యోగులకు శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు చేతులమీదుగా నూతన వస్త్రాలు బహుకరించారు.



# పామూరులో కార్డన్ & సెర్చ్ కార్యక్రమం నిర్వహించిన పోలీసులు

మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) జనవరి 19 : కార్డన్ & సెర్చ్ కార్యక్రమంలో అంకాలమ్మ వీధి మరియు విరాట్ నగర్ ప్రాంతాల్లోని అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల ఇళ్లు, గ్రామ శివారులు, ముఖ్య కూడళ్లు, పలు దుకాణాలు తదితర ప్రాంతాలను క్షుణ్ణమైన తనిఖీలు చేపట్టారు. నేరాల నివారణ, అక్రమ కార్యకలాపాలపై ముందస్తు నియంత్రణ చర్యలలో భాగంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పత్రాలు లేని 13 బైకులు, రెండు ఆటోలు సీజ్ చేయడమైనది. ఈ కార్యక్రమంలో పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ మాకినేని శ్రీనివాసరావు, పామూరు పట్టణ ఎస్ఐ కట్ట అనుక్, సి.యస్.పురం ఎస్సై వెంకటేశ్వర్ల నాయక్, వెలిగండ్ల ఎస్సై పావని మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు?

# అనాథ విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా

## విద్యా కుసుమానికి జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయం-ఉన్నత విద్యకు లక్ష రూపాయల చెక్కు అందజేత

## జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి




నంద్యాల, జనవరి 19:-మట్టిమిద్దె కూలిపోవడం వల్ల అనాథగా మారిన విద్యార్థిని విద్యా కుసుమాన్ని అక్కున చేర్చుకొని, అమ్మాయి ఉన్నత విద్యకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అందజేశారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ అనంతరం, మట్టిమిద్దె కూలిపోవడంతో కుటుంబాన్ని కోల్పోయిన విద్యార్థిని ఉన్నత విద్య (ఇంటర్మీడియట్) కోసం లక్ష రూపాయల విలువైన చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థినికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు 25 వేల మంది మట్టిమిద్దెల్లో నివసిస్తున్నారని తెలిపారు. అకాల వర్షాల కారణంగా మట్టిమిద్దెలు కూలిపోయి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో, ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా రెవెన్యూ యంత్రాంగం ద్వారా వారం రోజుల ముందుగానే మట్టిమిద్దె నివాసితులకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ అకాల వర్షాల తీవ్రత కారణంగా చాగలమర్రి మండలం చిన్నగొంగలి గ్రామానికి చెందిన ఒక కుటుంబం తీవ్ర విషాదాన్ని ఎదుర్కొందన్నారు. ఆ కుటుంబంలో తల్లిదండ్రులు, ముగ్గురు కుమార్తెలు నివసించేవారని, మట్టిమిద్దె కూలిపోవడంతో భార్యాభర్తలు మరియు ఇద్దరు కుమార్తెలు మృతి చెందారని తెలిపారు. కుటుంబానికి చెందిన తలపురెడ్డి గురులక్ష్మి ప్రసన్న అనే విద్యార్థిని ప్రొద్దుటూరు వసతి గృహంలో పదవ తరగతి చదువుతుండటంతో ప్రాణాలతో బయటపడిందన్నారు. సదరు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల నష్టపరిహారం మంజూరు చేయడంతో పాటు, ప్రాణాలతో బయటపడిన బాలిక భవిష్యత్తు దృష్ట్యా రూ.2 లక్షలను ఆమె అమ్మమ్మకు అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యార్థిని పదవ తరగతి పూర్తి చేసిన నేపథ్యంలో, ఆమె ఇంటర్మీడియట్ విద్య కొనసాగించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి ఈడీ నోటీసులు

రెండు రోజుల క్రితం వైసీపీ మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి నోటీసులు ఇచ్చిన వైనం ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ క్రమంలోనే వైసీపీ మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఇదివరకే నోటీసులు జారీ చేసిన ఈడీ, తాజాగా ఆ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డికి సైతం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 23న విచారణకు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొంది. ఇదివరకే ఈ కేసులో నిందితుడిగా ఉన్న మిథున్ రెడ్డిని సిట్ అరెస్టు చేయగా, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా కొంతకాలం ఉన్నారు. అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలయ్యారు. వైసీపీ మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని 22వ తేదీన విచారణకు రావాలని కోరిన ఈడీ, ఆ మరుసటి రోజే మిథున్ రెడ్డి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది

# తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్పీకర్ అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై సమాధానం ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశిస్తూ నోటీసులు ఇచ్చింది. అనంతరం ఈ వ్యాజ్యాన్ని ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి, కేటీఆర్‌ల పిటిషన్లతో జత చేసింది. ఈ పిటిషన్లన్నింటిపైనా కలిపి ఫిబ్రవరి 6న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ముగ్గురు పోలీసులుపై ఎస్పీ సస్పెన్షన్ వేటు

**సీఐ,ఎస్ఐలతో పాటు కానిస్టేబుల్ సస్పెండ్....**



సత్యసాయి జిల్లా ఎడిటర్ జనవరి..18
సత్యసాయి జిల్లా:శ్రీ సత్యసాయి జిల్లాలో పోలీస్ శాఖలో క్రమశిక్షణ లోపాలకు ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ కఠిన చర్యలు తీసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ముగ్గురు పోలీసు అధికారులపై వేటు పడింది.
తనకల్లు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్సై గోపి, హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని, బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేదన్న ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టగా ఆరోపణలు నిజమని నిర్ధారణ కావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇక పుట్టపర్తి అర్బన్ సీఐ శివాంజనేయులుపైనా ఎస్పీ వేటు పడింది. ఆయనపై అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో అంతర్గత విచారణ నిర్వహించారు. విచారణలో పలు అవకతవకలు వెలుగులోకి రావడంతో సీఐపై కూడా కఠిన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, బాధ్యత చాలా ముఖ్యమని, ప్రజలకు న్యాయం చేయాల్సిన అధికారులు తప్పుదారి పట్టితే ఎలాంటి ఉపేక్ష ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ఘటన జిల్లాలో పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...

మావోయిస్టుల కదలికలపై అందిన నమ్మకమైన సమాచారంతో డీఆర్‌జీ బీజాపూర్, డీఆర్‌జీ దంతేవాడ, ఎస్‌టీఎఫ్, కోబ్రా బలగాలు (202, 206, 210 బెటాలియన్లు), సీఆర్‌పీఎఫ్ 214 బెటాలియన్‌కు చెందిన సంయుక్త బృందాలు ఈనెల 17న ప్రత్యేక సర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ ఆపరేషన్‌లో జనవరి 17 ఉదయం నుంచి 18 సాయంత్రం వరకు మధ్య తీవ్ర కాల్పులు చోటుచేసుకున్నాయి. మృతులను దిలీప్ బెంజా (రివార్డు రూ.8 లక్షలు), మాధవి కోసా (రూ.5 లక్షలు), పాలో పోడియం (రూ.5 లక్షలు), లఖీ మద్కం (రూ.5 లక్షలు), జుగ్లో బంజం (రూ.2 లక్షలు), రాధా మెట్ట (రూ.2 లక్షలు)గా గుర్తించారు. వీరిపై మొత్తం రూ.27 లక్షల రివార్డు ఉందని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పత్తిలింగం తెలిపారు. కీలక నేత దిలీప్ బెంజాపై బీజాపూర్ జిల్లాలో 135 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనాస్థలంలో నుంచి రెండు ఏకే-47లు, ఒక ఇన్సాస్, రెండు 0.303 రైఫిళ్లు, ఒక కార్బైన్‌తో పాటు పేలుడు పదార్థాలు, వైర్‌లెస్ సెట్లు, మావోయిస్టు సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు. దిలీప్ బెండ్జాపై 135కు పైగా కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు



# రేపల్లె పాస్టర్స్ ఫెలోషిప్ ద్వారా నూతన వస్త్రాలు అందజేత

రేపల్లె
రేపల్లె నేతాజీ నగర్ నందుగల జేబీఎం చర్చిలో రేపల్లె పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ కట్టుపల్లి విజయ రాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది ముఖ్యఅతిథిగా పాస్టర్ గిరిబాబు వర్తమానం అందించి నూతన వస్త్రాలు పాస్టర్సకు అందజేసినారు నూతనంగా కమిటీ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది వైస్ ప్రెసిడెంట్ గా పాస్టర్ అద్దేపల్లి ఇస్సాకు సెక్రెటరీగా పాస్టర్ ఫ్రాన్సిస్ ట్రెజరర్ పాస్టర్ వరప్రసాదు కమిటీ సభ్యులు పాస్టర్ మోజెస్ సురేష్ లను ఎన్నుకోవడం జరిగింది రానున్న కాలంలో పాస్టర్సకి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని తెలియజేయడం జరిగింది...

# ఆదోని జిల్లా ను సాధించుకుందాం

## - 39 వ రోజు రిలే దీక్షల్లో ఎం.కొట్టాల గ్రామ యువకులు

ఆలూరు:
వెనుకబడిన ఆలూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదోని ను జిల్లా గా ప్రకటించాలని ఆలూరు జె ఏ సి నాయకులు కత్తి రామాంజినేయులు,ఎల్లప్ప,చంద్రకాంత్ రెడ్డి,పూల రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు జె ఏ సి ఆధ్వర్యంలో ఆదోని జిల్లా సాధన కోసం సాగుతున్న దీక్ష 39వ రోజుకు చేరుకుంది ఈ దీక్షలో మొలగవల్లి కొట్టాల గ్రామం కు చెందిన వైసిపి ఆర్ ఆర్ టి ఐ వింగ్ జిల్లా ఉపాధ్యక్షులు కొట్టా ల రాజు,రాయలసీమ దళిత సంఘం జిల్లా అధ్యక్షులు యనమల రామాంజినేయులు,ఆలూరు ఇంచార్జి నౌనేపాటి, వార్డ్ నెంబర్ రంగముని యువకులు జయపాల్ ,బాబు,వినోద్ కుమార్,బాబు, ఇమ్మానుయేల్ ,జె.వినోద్ దీక్షలో కూర్చున్నారు. వీరికి బీసీ సంఘం నాయకులు లోక్ నాథ్,న్యాయవాది రంగప్ప,మార్పు సంస్థ ప్రతినిధి వేమిరెడ్డి,రిటైర్డ్ ఆర్ టి సి యూనియన్ నాయకులు దాదా భాష సంఘీభావం తెలిపారు. ఈ నెల 24 నా జరిగే 5 నియోజకవర్గాల బంద్ ను జయప్రదం చేయాలని జె ఏ సి నాయకులు డిమాండ్ చేశారు.. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షను పరిగణలోకి తీసుకుని ఆదోని ను జిల్లా గా ప్రకటించాలన్నారు.



# దావోస్ వేదికగా పెట్టుబడుల వేట..

.టెక్నాలజీ, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, రైల్వే, ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ వంటి కీలక రంగాల్లో స్విస్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలను ఈ సందర్భంగా లోకేశ్ వివరించారు. పారిశ్రామిక రంగంతో పాటు విద్యా రంగంలోనూ సహకారంపై చర్చించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫార్మా, వైద్య పరికరాలు, స్టార్టప్‌ల రంగాల్లో స్విట్జర్లాండ్‌లోని ప్రముఖ విశ్వవిద్యాలయాలతో ఏపీలోని విద్యా సంస్థల భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై దృష్టి సారించారు. దీని ద్వారా ఏపీకి చెందిన నిపుణులు, విద్యార్థులు, తెలుగు ప్రవాసులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవలే కుదిరిన ఇండియా-జుఖీూా (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలు, ఆవిష్కరణల పరంగా ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని మంత్రి లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం ఏపీకి స్విస్ పెట్టుబడులు రావడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# బాక్సాఫీస్ వద్ద నవీన్ పోలిశెట్టి హవా.

యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'అనగనగా ఒక రాజు' చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైన ఈ సినిమా, కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారని మరోసారి రుజువు చేసింది. స్టార్‌డమ్ కంటే కథకే ప్రాధాన్యత ఇచ్చే నవీన్, ఈ చిత్రంతో తన మార్కెట్‌ను అగ్రస్థాయికి తీసుకెళ్లారు.

తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లిన ఈ చిత్రం వసూళ్లలోనూ అదే జోరు చూపించింది. మొదటి రోజే రూ. 22 కోట్ల గ్రాస్ సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. కేవలం మూడు రోజుల్లో రూ. 61.1 కోట్లు రాబట్టిన ఈ సినిమా, ఐదు రోజులు పూర్తయ్యేసరికి రూ. 100.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్టు నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. పెద్ద సినిమాల పోటీ మధ్యలోనూ నవీన్ సినిమా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం.

క్లీన్ కామెడీ, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలతో దర్శకుడు మారి ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నవీన్ పోలిశెట్టి తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో సినిమాకు ప్రాణం పోశారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇదే అసలైన పండగ సినిమా' అంటూ ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల నుంచి బయటకు వస్తుండటం ఈ సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఓవర్సీస్‌లోనూ 'రాజు' గర్జన స్వదేశంలోనే కాకుండా ఓవర్సీస్‌లోనూ 'రాజు' గర్జన కొనసాగుతోంది. ముఖ్యంగా యూఎస్ మార్కెట్‌లో ఈ చిత్రం 1 మిలియన్ డాలర్ల వసూళ్లను అధిగమించింది. దీంతో 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రాల తర్వాత వరుసగా మూడోసారి 1 మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరిన సినిమాగా నిలిచింది. ఈ హ్యాట్రిక్ విజయంతో అమెరికాలో నవీన్ పోలిశెట్టి తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్కెట్‌ను సృష్టించుకున్నారు. కథ, పాత్రల బలాన్ని నమ్ముకుని సినిమాలు చేసే నవీన్, తన విజయపరంపరను కొనసాగిస్తున్నారు.




# హ్యాట్రిక్ కి ఒక్క అడుగు దూరంలో!



అందాల మీనాక్షి చౌదరి మంచి విజయంతో కొత్త ఏడాదిలోకి గ్రాండ్ గా అడుగు పెట్టింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన -అనగనగా ఒక రాజు- తో డీసెంట్ హిట్ అందుకుంది. ఇందులో మీనాక్షి పాత్రకు మంచి పేరొచ్చింది. మరి ఈ విజయంతో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి. గత ఏడాది సంక్రాంతికి కూడా అమ్మడు -సంక్రాంతికి వస్తున్నాం-తో భారీ విజయాన్నే అందుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా 300 కోట్ల వసూళ్లనే సాధించింది. కానీ ఆ తర్వాత నటిగా మాత్రం బిజీ కాలేకపోయింది. అక్కడో కారణం ఉంది. హీరోయిన్ పరంగా ఆ సినిమా క్రెడిట్ అంతా ఐశ్వర్యా రాజేష్ కొట్టేసింది. కానీ ఆ సక్సెస్ తో ఐశ్వర్య కూడా బిజీ కాలేదు. మరి తాజా సక్సెస్ తోనైనా మీనాక్షి బిజీ అవుతుందా? అన్నది చూడాలి. కానీ లైనప్ పరంగా చూస్తే? మీనాక్షి చౌదరి హ్యాట్రిక్ విజయానికి ఒక్క అడుగు దూరంలో ఉంది. -సంక్రాంతికి వస్తున్నాం-, -అనగనగా ఒక రాజు-తో బ్యాక్ టూ బ్యాక్ విజయాలు అందుకుంది. అమ్మడి ఖాతాలో మరో విజయం పడితే హ్యాట్రిక్ నమోదైనట్లే. అందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా నటిస్తోన్న మిస్టికల్ థ్రిల్లర్ -వృషకర్మ-లో హీరోయిన్ గా నటిస్తోంది. కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. -విరూపాక్ష-తో ఫ్లాప్ ల్లో ఉన్న సాయితేజ్ కు సరికొత్త ఇమేజ్ తీసుకొచ్చిన దర్శకుడతను. -విరూపాక్ష- బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల వసూళ్లను సాధించింది.ఆ తర్వాత మరే సినిమా డైరెక్ట్ చేయకుండా -వృషకర్మ-పైనే పని చేసాడు. ఈ సినిమా ను కూడా కార్తీక్ చెక్కుతున్నాడు. చైతన్యకు బ్లాక్ బస్టర్ ఇవ్వాలనే కసితో పనిచేస్తున్నాడు. ఇందులో నాగచైతన్య సాహసకుడి పాత్రలో కనిపించనున్నాడు. మీనాక్షి చౌదరి పాత్రకు అంతే ప్రాధాన్యత ఉంది. దీంతో ఈ సినిమా విజయం సాధిస్తే? మీనాక్షి ఖాతాలో హ్యాట్రిక్ నమోదవుతుంది. మీనాక్షి బ్యూటీ రేసులో వెనుకబడటానికి ప్రధాన కారణం ఒకటుంది. అమ్మడు గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుం ది. పెదవి ముద్దులు..ఇంటిమేట్ సీన్స్ అంటే నో చెబుతుంది. డీసెంట్ రోల్స్ మినహా ప్రయోగాలకు వెనుకాడుతుంది. కానీ ఉన్న కాంపిటీషన్ లో వెనక్కి తగ్గితే అవకాశాలు అందుకోవడం కష్టం అని తెలిసినా? ఛాన్స్ తీసు కోవడం లేదు. మరి కొత్త ఏడాది ఏమైనా కొత్తగా ఆలోచిస్తుందేమో చూడాలి

# లేడీ సూపర్ స్టార్ పర్ఫెక్ట్ ప్లానింగ్!



లేడీ సూపర్ స్టార్ నయనతార సౌత్ లో ఎంత పెద్ద హీరోయిన్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. దక్షిణాదిన ట్రెడింగ్లో ఉన్న నెంబర్ వన్ బ్యూటీ. అత్యధిక పారితోషికం తీసుకుంటోన్న హీరోయిన్ కూడా ఆమె. సౌత్ లో అన్ని పరిశ్రమలు ఆమెతో సినిమాలు చేయడానికి ఎంతో ఆసక్తి చూపిస్తాయి. స్టార్ హీరోలు సైతం ఆమె డేట్లు కోసం క్యూలో ఉంటారు? అంటే అతిశయోక్తి కాదు. దీనంతటికీ కారణం నయనతార తనను తాను బిల్డ్ చేసుకోవడమే. నలుగురిలో ఒకరిలా కాకుండా? నలుగురికి భిన్నంగా ఉండటమే ఆక్రేజ్కి కారణమైంది. వృత్తి, వ్యక్తగతంగా నయన్ ఎంతో స్పెషల్ గా కనిపిస్తుంది. నటిగా మాత్రం భిన్నమైన స్ట్రాటజీతోనే అడుగులు వేస్తోంది. క్లాస్ మాస్ ఇమేజ్ ని తెలివిగా బ్యాలెన్స్ చేయడం తనకు తెలిసినట్లుగా మరో నటికి తెలియడం లేదనొచ్చు. కోలీవుడ్ స్టార్స్ తో నటిస్తూనే తెలుగులో సీనియర్ హీరోలకు జోడీగా నటిస్తోంది. ఆ తర్వాత తరం హీరోలతో సినిమాలు చేయడం లేదు. అవకాశాలు వస్తున్నా? స్కిప్ కొడుతుంది. వాళ్లతో నటించిన సినిమాలు ఫెయిలైతే? ఆ ప్రభావం తర్వాత సినిమాలపై పడుతోంది అని భావించి సెలక్టివ్ గా ఉంటుంది. సీనియర్ హీరోల సినిమాలు ఫ్లాప్ అయినా? ఆ ఇంపాక్ట్ తనపై పెద్దగా పడటం లేదు. ఫ్లాప్ క్రెడింట్ అంతా హీరో ఖాతాలోకే వెళ్లిపోతుంది. హిట్ అయితే హీరోతో పాటు హీరోయిన్ కి పేరొస్తుంది. ఇది తెలుగు సినిమాల పరంగా నయన్ ఆడుతోన్న తెలివైన ఆట. కోలీవుడ్ లో మాత్రం కమర్శియల్ చిత్రాల్లో నటిస్తూనే లేడీ ఓరియేంటెడ్ నాయికగానూ సత్తా చాటే ప్రయత్నా లు చేస్తోంది. దురదృష్టం కొద్ది లేడీ ఓ రియేంటెడ్ చిత్రాలు సక్సెస్ అవ్వడం లేదు. సోలోగా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాలని కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా సరైన ఫలితాలు రావడం లేదు. నిజంగా అదే జరిగిన రోజు నయన్ ఇమేజ్ నాలిగింతలు రెట్టింపు అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఘాశ్రీంశీ =ఝు - సంక్రాంతి చిత్రాలు.. ఇప్పుడే అసలు పరీక్ష.. నెట్ ఫ్లిక్స్ డాక్యుమెంటరీల్లో సైతం నయన్ నటిస్తోంది. కానీ సీరియస్ గా డాక్యుమెంటరీలపై పని చేయలేదు. అవకాశం వస్తే తప్ప సీరియస్ గా తీసుకోవడం లేదు. కానీ కొత్త ఏడాదిలో వాటిపైనా దృష్టి పెడుతుందన్నది తాజా సమాచారం. ఇదే ఏడాది అమ్మడు తొమ్మిది-పది సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించబోతుంది. ఇప్పటికే -మనశంకరవరప్రసాద్ గారు- విజయంతో బోణీ కొట్టేసింది. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన సినిమా సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతుంది. ఇప్పటికే 200 కోట్ల వసూళ్లను సాధించింది. 300 కోట్ల వసూళ్లను క్రాస్ చేస్తుందనే అంచనాలున్నాయి

# బ్లాక్ అవుట్ ఫిట్‌లో నేహా అందాలు అదరహో..

ప్రస్తుత కాలంలో చాలామంది హీరోయిన్స్ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తూ ఆడియన్స్ ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో పైగా సినిమాలలో అవకాశాలు ఉన్నా.. లేకపోయినా.. సోషల్ మీడియాను మాత్రం అస్సలు వదలడం లేదు అని చెప్పడంలో సందేహం లేదు. ఎందుకంటే ఈ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఆడియన్స్ కు సెలబ్రిటీలను దగ్గర చేయడమే కాకుండా వారికి సినిమాలలో కూడా అవకాశాలు కల్పిస్తుందనే ఆశ ఇప్పుడు అందరిలో మొదలైంది. అందులో భాగంగానే తమ ఉనికిని చాటుకోవడానికి సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు సెలబ్రిటీలు. పైగా ఇప్పుడు సమయం సందర్భంతో పనిలేకుండా తమకు నచ్చినప్పుడు నచ్చిన ఫోటోలను షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే సండే స్పెషల్ అంటూ ప్రముఖ బ్యూటీ నేహా శర్మ తన అందాలు ఆరబోస్తూ బ్లాక్ డ్రెస్ లో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా రకరకాల ఫోజులతో కుర్రకారులో హీట్ పుట్టించిందని చెప్పవచ్చు. బ్లాక్ అవుట్ ఫిట్ లో అమ్మడి అందానికి అభిమానులు కూడా ఫిదా అవుతున్నారు. మొత్తానికి నేహా శర్మ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. 1987 నవంబర్ 21న బీహార్ లోని భాగల్పూర్ లో జన్మించింది. ఈమె తండ్రి అజిత్ శర్మ వ్యాపారవేత్త.ఎ పైగా రాజకీయ నాయకుడు కూడా.ఎ ఈయన భాగల్పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.. నేహా శర్మ న్యూఢిల్లీలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ కళాశాలలో ఫ్యాషన్ డిజైన్ కోర్స్ పూర్తి చేసింది. చిన్నప్పుడే ఆస్తమా వ్యాధితో బాధపడిన ఈమె.. హైదరాబాదుకు చెందిన ఒక కుటుంబం సహాయంతో వ్యాధిని నయం చేయించుకున్నట్లు సమాచారం. అయితే సినిమాల్లోకి రావాలనుకున్న నేహా శెట్టి అందులో భాగంగానే మోడల్ గా తన కెరీర్ను ఆరంభించి, 2007లో తొలిసారి మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబల్





స్టార్ రామ్ చరణ్ తొలి పరిచయంలో వచ్చిన 'చిరుత' సినిమాతోనే ఈమె కూడా తొలిసారి ఇండస్ట్రీకి పరిచయమయ్యింది. ఈ సినిమా మంచి విజయం అందుకుంది. ఈ సినిమా తర్వాత 'కుర్రాడు' అనే మరో తెలుగు చిత్రంలో నటించిన నేహా శర్మ దాని తర్వాత మళ్ళీ తెలుగులో సినిమాలు చేయలేదు. హిందీలో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరించిన ఈమె.. చివరిగా దేదే ప్యార్ దే 2 సినిమాలో నటించింది. ప్రస్తుతం జాస్సీ గిల్ తో సంజోగ్ అనే పంజాబీ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే సోనీ లైవ్లో ఒక వెబ్ సిరీస్ చేస్తోంది. దీనితో పాటు మరి రెండు ప్రాజెక్టులు ఈమె చేతిలో ఉన్నాయి. ప్రస్తుతం సినిమాలు, వెబ్ సిరీస్ లు అంటూ బిజీగా గడిపేస్తున్న నేహా శర్మ.. ఇలా గ్లామర్ తో కూడా ఆడియన్స్ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది.

# పుట్టినరోజున ఫ్యాన్స్‌కు ట్రీట్..

**-ఆకట్టుకుంటున్న వరుణ్ తేజ్ కొత్త సినిమా టైటిల్ గ్లింప్స్**

**-వరుణ్ తేజ్ 15వ చిత్రానికి టైటిల్ ఖరారు**
**-'కొరియన్ కనకరాజు'గా రానున్న మెగా ప్రిన్స్**
**-పుట్టినరోజు సందర్భంగా టైటిల్ గ్లింప్స్ విడుదల**
**-ఇండో-కొరియన్ హారర్ కామెడీగా సినిమా**
**-2026 వేసవిలో థియేటర్లలోకి రానున్న చిత్రం**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మెర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాకు ఆసక్తికర టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఌ15' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'కొరియన్ కనకరాజు' అనే పేరును ఖరారు చేస్తూ సోమవారం వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేశారు.

విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. కనకరాజు అనే వ్యక్తి కోసం కొరియా పోలీసులు ఓ భారతీయ ఫొటోగ్రాఫర్‌ను చిత్రహింసలు పెట్టడంతో వీడియో ప్రారంభమవుతుంది. ఇంతలో పౌర్ణమి రాత్రి కనకరాజు (వరుణ్ తేజ్) ఓ ఆత్మ ఆవహించిన వాడిలా పోలీస్ స్టేషన్‌లోకి ప్రవేశించి, సమురాయ్ కత్తితో పోలీసులను అంతం చేస్తాడు. చివర్లో అతను కొరియన్ భాషలో 'నేను తిరిగొచ్చాను' అని చెప్పడం, "ఈ కనకరాజు మన కనకరాజు కాదు" అంటూ ఫొటోగ్రాఫర్ చెప్పే డైలాగ్ ఉత్కంఠను రేకెత్తిస్తోంది.

ఇండో-కొరియన్ హారర్ కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, పనీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్, అనంతపురం, కొరియాలలో కీలక షెడ్యూళ్లను పూర్తి చేసుకున్న ఈ సినిమాను 2026 వేసవిలో థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు



Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com